# అభినవ సారంగధరుడు

అది యింకా టాకీలూ, విమానటపాలూ, నాలుగైదు తెలుగు పత్రికలు కూడా లేని కాలం.

పురుషోత్తం రాత్రి ఏడింటికి పాసంజర్‌లోంచి సెంట్రల్ స్టేషనులో దిగాడు. తనకోసం బండిపంపమని వకీలు శంకర్రావుకి వ్రాశాడు. పంపాడో, లేదో!

"తమరేనా, పురుషోత్తంగారు?........దయ చెయ్యండి."

అతన్నీ సామానునీ పెద్ద మోటారులో యెక్కించి తీసుకు పోయినారు.

"శంకర్రావు మోటారుకూడా కొన్నాడా? ఈ పట్నం ప్లీడర్లకి యెంతలో ప్రాక్టీసు వొస్తుందో! ఆమామ గాడ్దెదకొడుకు ఓ వెయ్యి యిచ్చివుంటే నేనూ ఇక్కడే బిల్లకట్టి, యీ పాటికి సొంత మోటరులో తిరుగుతూ వుందునుకదా!" అనుకొంటున్నాడు. తరవాత శంకర్రావుతో మాట్లాడవలసిన కేసు పాయింట్లు జ్ఞాపకం తెచ్చుకున్నాడు. ఈ పట్నం వకీళ్ళకి, మఫిజిలు ప్లీడర్లకి తెలివి ఎక్కువ లేదని వుద్దేశ్యం.

ఎక్కడికి పోతోంది యీ మోటారు?

"ఏయ్, ఇదేమిటి? మైలాపూరుకు వెళ్లాలి,"

"శంకర్రావుగారు కీల్పాక్‌కి మారారండి."

"ఆహా!"

పెద్దగేటులోంచి, తోటదాటి, గొప్ప భవనం దగ్గిరికి పోతోంది బండి. ఇల్లంతా దీపాల విభవంతో వెలుగుతోంది.

ఇది శంకర్రావు యిల్లా! తప్పు యెడ్రెస్‌కి రాలేదుకదా? కాని కారువాడికి తెలీదా?

"శంకర్రావుగారి యిల్లేనా?"

"అవునండి. ఆయనకి డర్బీ స్వీప్ వొచ్చింది తెలీదా తమకు!"

"ఆహా, వాడు వ్రాయనేలేదే?"

పురుషోత్తం యీర్ష్య తగ్గింది. వకీలు వృత్తిలో సంపాయించా డనుకున్నంత బాధలేదు. బండీ ఆగింది.

"దయచెయ్యండి."

సామానుల్నీ, ఆయన్నీ ఒక గొప్పగదిలో కూచో పెట్టారు.

"ఫలహారం కావాలా?"

"శంకర్రా వేడీ?"

"వెడదాం పైకి. ముందు టీ తీసుకోండి. భోజనానికి ఆలస్య ముంది."

ఫలహారం చేస్తూ ఉండగా, ఒకడు చంకీకోటూ లాగూ, జరీ తలపాగా, చమ్కీచడావులూ, బనారసు కండువా తీసుకొచ్చాడు.

శంకర్రావు యెదురు వొస్తా డనుకున్న పురుషోత్తం "ధనంతో యెంత గర్వ మెక్కుతుందా" అనుకుంటున్నాడు.

"ఇవి వేసుకోండి."

"అదేమిటి?"

"ఇక్కడ అతిథులకి యివి ధరించడానికి యివ్వడం మామూలు. ఈ బట్టలు వేసుకుని గాని ఆయన్ని దర్శించడానికి వీలులేదు."

డర్బీస్వీపుతో శంకర్రావుకి మతి పోయిందనుకున్నాడు.

"నా కిష్టం లేదు, వేసుకోను. వాణ్ణి ఒక్కసారి రమ్మనండి; కనుక్కుంటాను."

"ఇవి వేసుకోండి కనపడరు. తరువాత ఆయనతో మాట్లాకి ఆయన వొప్పుకుంటే తీసివెయ్యండి."

"వాడితో చెప్పారా నేను వచ్చాననీ?"

"వారే పంపారు యివి యేరి మీకు"

ఏం చేస్తాడు? వేసుకున్నాడు. ముందు పెద్ద అద్దముంది తన వేషం చూసుకున్నాడు. పురుషోత్తం చాలా అందమైన మనిషి. తెల్లగా, పాలుకారే చర్మం, యెర్రని పెదవులు, తీర్చిన మీసాలు. ఆ దుస్తులు వేసుకుని చూసుకుంటే, యే పురాతన రాజకుమారుడి మల్లేనో వున్నాడు. అతని కాస్ట్యూమ్ మీద ప్రేమకలిగింది. ఆవేశంతో కోర్టుకి వెడితే, యే జడ్జీగాని, కేసు ఎదటిపక్షం చెయ్యగలడా?

"రండి"

మేడమీదికి వెళ్ళారు.

"అదే వారిగది. లోపలికి వెళ్ళండి అన్నారు."

తలుపు తెరిస్తే, లోపలంతా చీకటి కాని వొక్క నిమిషంలో గప్పు మని గది ముట్టుకున్నట్లయింది. గోడల్లోంచి, కప్పులోంచి, కింద నేల నించి అనేక దీపాలు వెలిగాయి. పంకాలు గావును బుయ్యిమని శబ్దం చేస్తున్నాయి. ఫానులుగాని దీపాలుగాని కనపడకుండా లోపలే అమర్చారు గది అద్భుతంగా అలంకరించి ఉంది. మొహమల్ కుర్చీలు, సోఫాలు, పటాలు-వెండి దీపపు సెమ్మెలు, తివాసీలు, పాన్దాను, ఫలహారాలు చక్కని పళ్లాల్లో. కాని అన్నీ పురాతనపు 'ఫాషన్'. ఏదో రాజు పడకగదివలె ఉంది. ఆశ్చర్యంతో చూస్తు న్నాడు. దూరంగా వెనగ్గావున్న పెద్ద హంసతూలికా పాన్పుమీద, చాలా అందమైన స్త్రీ పడుకునిఉంది. శంకర్రావు యీ వేషం వేసు కున్నాడు గావును; పురుషోత్తాన్ని చూడగానే, ఆమె చప్పున కిందికి దూకి సంతోషంతో ఎగిరినదానివలె, చిరునవ్వుతో వొస్తోంది. కలా? మాయా? ఆమె పురాతనపు నగలను, బావిలీలు, బుజబందులు పెట్టు కుంది. రేవికా లేదు, సమిటా లేదు. రొమ్ముకి యేదో పట్టుబట్ట చుట్టు కుంది, కింద చీనీల పావడ-మార్వాడీవానివలె. ఆమె అతన్ని సమీ పిస్తోనే-

"రా యీ దీనురాలి మందిరాన్ని నీ అపార సుందర దృష్టితో తేజరిల్ల జేయడానికి వొచ్చావా? రా ఇట్లా కూర్చో" అంది. అంటూ చేతులు పట్టుకుని కూచో పెట్టి పక్కన కూచుంది. ఫలహారాలు తినమని పెట్టింది. క్రమంగా అతని మీద కళ్ళలో అమితంగా మోహం చూపసాగింది. వేళ్ళు తాకడమూ, అతను తాగిన గిన్నెలో తాగడమూ, అతని పుత్తరీయాన్ని ముద్దు చెయ్యడమా. నవ్వుతో గంధము రాయడమూ, తాంబూలము నోటి కందివ్వడమూ సాగించింది. 'రా నా మేడను చూద్దుగాని' అంటూ పాట పాడుతూంది. నవ్వుతుంది, చెయ్యిపట్టుకు లాగుతుంది. ఆమె చర్యలు గమనించి అతనికి భయమూ వెగటూ తోచి వెళ్ళిపోవాలని చూస్తున్నాడు.

వాళ్ళ వూళ్లో పురుషోత్తానికి అభినవ సారంగధరుడని పేరు. అతని సవితితల్లితో నిజంగా సారంగధర నాటకం జరిగిందని ప్రతీతి. అతని తండ్రి మాత్రం అతన్ని యింటోంచి పంపించి, ఆస్తి వేరే వాళ్ళకి విల్లుచేసినమాట నిజం. నీతినిగురించీ, దేశంలో ప్రబలుతున్న అవినీతినిగూర్చి, ప్రాచీనకాలపు నియమాల్ని గూర్చి, సంసార పారి శుద్ధ్యాన్ని గూర్చి అతను విరివిగా పుపన్యాసా లిచ్చి ప్రచారంచేశాడు. అదిగాక, తన స్వీయచరిత్రలో, తన ఏకపత్నీ వ్రతాన్ని ఆదర్శమని ప్రజలకు చాటాడు,

ఇప్పు డీ పరస్త్రీ తన నట్లా సమీపిస్తే అతనికి కొపం వొచ్చింది, ఆమె నించి తప్పించుకోవాలని యిటూ అటూ వెళ్లాడు. ఆమె ఏదో మిషతో అతని వెంట తిరుగుతోంది. అత నడిగిన ప్రశ్నల్ని 'ఇదేమిటి? శంకర్రావేడి? నువ్వెవరు?' అంటే వినిపించుకోదు. పైగా తనని, 'సారంగా, సారంగా' అని పిలుస్తుంది.

"ఇదేమన్నా పిచ్చిదేమో" అనుకున్నాడు. తన వేమన్నా చేస్తే! మెల్లిగా తలుపు దగ్గిరికి వెళ్ళి తెరవపోయినాడు. రాదు.

అతనికి భయంపుట్టింది. ఇటూ అటూ వెళ్ళాడు, అరిచాడు. ఆమె అతన్ని ఓకమూల ఇరికించి, తన మోహాన్ని వెల్లడి చేసింది. అతను లేక పోతే బతకలేనంది. కోపంతో తోసేశాడు.

"నువ్వు నన్ను నిరాకరిస్తే ఎట్లా బతకను? కొంచమైనా

కనికరం లేదా? నా యౌవనాన్ని నా అందాన్ని చూడు. ఆ ముసలి మొగుడితో యెట్లా ప్రేమ ననుభవించను? నేను నీదాన్ని. తీసుకో" అని అతని మీద పడ్డది. అతను దూరంగా వెళ్ళి చూశాడు. ఆమె దగులుగా చూస్తో నుంచుంది. ఆమె చూపులు చాలా గాఢంగా, మన్మధోద్దీపనాలుగా వున్నాయి.

ఆమె శంకర్రావు భార్యా? లేక వుంపుడుకత్తా? తనని పొరబాటున శంకర్రావు పడక గదిలో ప్రవేశపెట్టారు గావును! కాని శంకర్రావు ఏమీ ముసలివాడు కాడే! తన జాలిని రేపటానికి అట్లా అంటోందేమో! ఆముసలి వాడు తనని పెట్టే బాధలు చెపుతోంది, వాడు యింటో లేడు, రాడు, భయం వొద్దంటోంది.

అతని వెంట పరిగెత్తడంతో ఆమె జుట్టు వూడి పోయింది. ఉత్తరీయం కింద పడ్డది. ఆయాసంతో ఆమె పీన స్తనం లేచి పడుతోంది, యెత్తుగా లోతుగా!

''ఇంక యెక్కడికి పోతావు?'' అంటూ అతన్ని కావలించుకొని ముఖ మెత్తింది. అతను తోసేస్తున్నాడు. కాని యెవరూ లేరు. ఎరగని వూరు. తా నొక్కసారి అనుభవించినా యెవరికి తెలిసే భయంలేదు, అందులో అప్రయత్నంగా అతని పాప భోధనలేకుండా, మీదికి వొచ్చి బలవంతం చేస్తోంది. అతని తప్పిదం స్వల్పం. మరి అట్లాంటి పరిస్థితులలో. క్రొత్తస్థలంలో, మరి ఆమె మాట వినక పోతే తన కేమి ఆపద రాపోతోందో? ప్రాణం మీదికే వొచ్చినప్పుడు యింక నీచమైన పని కాని చెయ్యా వలసిందే, అని అతని మనసు ఆలోచిస్తోంది. ఆమెరంగు చూడు ఆమె చేతులు నునుపు చూడు, అంటున్నాయి కళ్ళు. ఒక్కసారి ఆమెని, పాపం అట్లా ప్రాధేయ పడుతోందే, కావిలించికో. ఆ పట్టు పాన్పు మీద, యీదివ్య భవనంలో యెటువంటి ఆనందం అనుభవించగలవు! మళ్ళీ నీ కిట్లాంటి 'ఛాన్సు' నాలుగు జన్మాలకైన దొరుకుతుందా! అంటున్నాయి చేతులు.''

ఆమె వూపిరి, అతని మొహంమీద తగులుతోంది. ఆమె రొమ్ము అతని రొమ్ముకి అనుకొని వెనక్కి వొంచింది.

పురుషోత్తం దగ్గిరగా చూసినవాళ్లలా, దాసీవాళ్ళూ, వితంతు ముసళ్ళూ, భార్యా. ప్రజాభయంవల్ల అందమైన స్త్రీ అని తోచగానే కళ్ళు కిందకి వాల్చి నడిచాడు. అందువల్లనే అతని కింతవరకు ఎప్పుడూ మన్మధ వికారం కలగలేదు. ఇంత అందమైన స్త్రీని ఇంత దగ్గిరగా కలుసుకోలేదు. అందువల్లనే అతనికి నీతిమార్గం సులభ మయింది. అతనెన్నడూ భయపడే విషయాలు, ఇతరులకి తెలీడం, అవమర్యాదా, ఇక్కడవున్నట్టు లేవు. ఆమెని గట్టిగా కావిలించుకుని, రవికని లాగేశాడు. అతనికి పూర్వానుభవం లేకపోవడంవల్ల పర స్త్రీతో యెట్లా మృదువుగా వ్యవహరించాలో తెలీదు.

"ఇదేమిటీ?" అని ఆశ్చర్యంతో చూసిందామె

బైటనించి "కట్ అప్" అనే కేక వినబడ్డది. తలుపులు తెరుచుకుని మనుష్యులు వొచ్చారు. అదంతా చాలా అన్యాయంగా కనపడ్డది పురుషోత్తానికి. ఆమెని, అయిష్టంగా, వొదిలి, వాళ్ల వేపు తెల్లబోయి చూస్తున్నాడు. రహస్యంగా, యెవరికీ తెలీకుండా తన నియమం చెడకుండా స్త్రీ దొరికిం దనుకుంటూ వుంటే యిదేమి అన్యాయం?

"ఏం పని చేశా రండీ! ఎంత నమ్మాము మిమ్మల్ని? సీనంతా తగలపడ్డది."

"ఏమిటి?"

"ఏమి ఏమిటి? మీపేరు అభినవసారంగధరు డవునా కాదా?"

"ఎవరో కొందర ట్లా నవ్వటాల కంటారు. ఐతే?"

"మీరు నీతిగురించి వుపన్యాసా లిచ్చారా లేదా?"

"ఇచ్చాను."

"మరి యిదేంపని?"

"ఎవరు యీమె?"

"ఈమా? చిత్రాంగి. ఎంత వెతికినా సరిగా నటించగల సారంగధరుడు దొరకలేదు, మాఫిల్మ్‌కి. ఎవడిని తీసుకొచ్చినా "ఛీ, ఛీ! పాపం. తల్లివి నమ్నుతాకకు" అంటూ మాచిత్రాంగి వంక మోహంతో చూసి, ఫిల్మ్ పాడుచేశారు. మరి మా చిత్రాంగిని అద్భుత

సౌందర్యరాశిని సంపాదించాము. ఈ కాలంలో నటనకైనా వైరాగ్యం కనపరిచే మనిషి లేడుకద!

ఒక శాస్త్రుల్లగారిని తీసికొస్తే, ఆయన మా చిత్రాంగి పక్క మీదనించి లేవకముందే మీదపడ్డాడు. నలుగురం పట్టుకుని లాగినా వొదలడే! ప్రతివాడూ నీతిశాస్త్రిలూ యేకరువు పెట్టేవాడేగాని, అనుష్ఠించేవాడు వొక్కడూ లేడే! చివరికి, మీకీర్తి విని, అభినవ సారంగధరు లని—"

"అవును కాని మా సవతి తల్లికి అంద మెక్కడిది, యౌవనం తప్ప—"

"మీ రేదో వొంటిగిస్తా రని- మీ ఉపన్యాసాలు కూడా చదివాము. ప్రతిస్త్రీకి లొంగిపో రని, అనేకులు చెపితే నమ్మి, వ్యయప్రయాసల కోర్చి, మోసంచేసి మిమ్మన్ని తీసుకొస్తే, ఇదేమిపని స్వామీ? ఎంతనమ్మించారండీ!"

"ముందే చెప్పకూడదు?"

"నటకులు కాదుకదా? చాతవుతుందో కాదో? సహజంగా మీ ముఖంలో భయమూ, విరక్తీ కనపరుస్తా రనుకున్నాము. చూడండి, గది ప్రతిమూలా "కెమెరాలు" ఏర్పాటుచేసాము. వృథా, వృథా! పోనిండిగాని, ఇన్నాళ్ళు మీరు నీతి విషయంలో పనిచేస్తున్నారు. మీకు శిష్యులు అనేక యువకులున్నారట-మా చిత్రాంగని మోహంతో చూడకుండా నటించే ఆయన్ని చెపుతారా?"

"లాభంలేదు. మొగాణ్ణిగాని కురూపినిగాని తీసుకురండి.... చిత్రాంగి వెయ్యడానికి. సరే నేను పోతాను. కాని ఈ సంగతి యెక్కడా తెలియచేయకండి. తెలియచేశారా, అక్రమ నిర్బంధానికై నేను మిమ్మల్ని కోర్టుకు లాగుతాను."

అని వెళ్ళిపోయినాడు సారంగధరుడు.